సాక్షి
నల్లగొండ

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



ఆత్మీయ పలకరింపు..
అవసాన దశలో ఉన్న అభాగ్యులను అక్కున చేర్చుకుని ఆదరిస్తున్నారు ఆశ్రమాల నిర్వాహకులు. - 8లో



యాదాద్రిలో భక్తుల సందడి
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం సుమారు 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. - 8లో



బడుగులకు పట్టం కట్టాలి
వచ్చే ఎన్నికల్లో బడుగులకు పట్టం కట్టాలని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ పిలుపునిచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

అంగన్‌వాడీల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

మిర్యాలగూడ టౌన్ : సమస్యల పరిష్కారం కోసం 20 రోజులుగా చేపట్టిన సమ్మెపై ముఖ్యమంత్రి కేసీఆర్ వైఖరిని నిరసిస్తూ శనివారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్(సీఐటీయూ, ఏఐటీయూసీ) జేఏసీ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలో భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొందు పార్వతి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ ఇతర అలవెన్స్‌లను వెంటనే విడుదల చేయాలని, సకాలంలో వేతనాలు, కూరగాయాల బిల్లులు, గ్యాస్ బిల్లులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ.సయీద్, దేశ్‌రాంనాయక్, మల్లు గౌతమ్‌రెడ్డి, రామ్మూర్తి, బైరెడ్డి రాణి, తూడి అరుణ, బి.నాగమణి, శ్రీదేవి, ఝాన్సీ, లక్ష్మి, నిర్మల, సుజాత, రాధాబాయి, ప్రమీల, పద్మ, ధనలక్ష్మి, వనజ, జూలకంటి మల్లీశ్వరి, కవిత, శ్రీదేవి, రషీదాబేగం తదితరులు ఉన్నారు.

స్వామినాథన్ ఆలోచనలు అమలు చేయాలి



స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : వ్యవసాయ పితామహుడు స్వామినాథన్ ఆలోచనలను ప్రభుత్వాలు అమలు చేయాలని అఖిల భారత కిసాన్ సంఘ్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ వ్యవసాయ రంగంలో శాస్త్రీయ ఆలోచనలను తీసుకొచ్చి హరిత విప్లవాన్ని సృష్టించారని చెప్పారు. ఆధునిక పద్ధతులు, సేద్యంలో మెళకువలు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిపై రైతులకు విస్తృత అవగాహన కల్పించారని తెలిపారు. సాగుపై ఆయన చేసిన పరిశోధనలు రైతులకు ఎంతో దోహదపడ్డాయన్నారు. ప్రభుత్వాలు స్వామినాథన్ సిఫారసులు, ఆలోచనలను అమలు చేసి రైతుల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, మల్లు గౌతంరెడ్డి, పోలెబోయిన వరలక్ష్మి, తిరుపతి రామ్మూర్తి, పాల్వాయి రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఊర్మిల, వాడపల్లి రమేష్, లెంకల మాధవరెడ్డి, రామారావు, రవినాయక్, బాషానాయక్ తదితరులు ఉన్నారు.

వేతనాల బడ్జెట్‌ను విడుదల చేయాలి



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నల్లగొండ టౌన్ : మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాల బడ్జెట్‌ను వెంటనే విడుదల చేసి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. వేతనాల కోసం బడ్జెట్‌ను విడుదల చేశామని ప్రభుత్వం తప్పుడు ప్రకటన చేస్తూ కార్మికులను మోసం చేస్తోందన్నారు. మెనూకు సంబంధించిన విధివిధానాలను రూపొందించి బడ్జెట్ కేటాయించాలని లేనిపక్షంలో మెనూను సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి పోలె సత్యనారాయణ, ఎస్‌కె కరీమున్నిసా, చింతపల్లి బయ్యన్న, పెంజర్ల సైదులు, వరికుప్పల ముత్యాలు, పోలగాని యాదమ్మ, నీరుడు రాజ్యలక్ష్మి, మేడి సైదులు, పానుగంటి లక్ష్మమ్మ, అల్లి అనురాధ, ముత్తమ్మ, అండాలు, అలివేలు, లక్ష్మమ్మ, దమయంతి, కృష్ణమ్మ, మంగమ్మ, హంస, సైదమ్మ, నాగయ్య పాల్గొన్నారు.

పోరు గడ్డపై..
ఐటీ విప్లవం

నల్లగొండ, సూర్యాపేటలో ఐటీ హబ్స్

- 2వ తేదీన వాటిని ప్రారంభించనున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- మొదటి వారం నుంచే కంపెనీల కార్యకలాపాలు షురూ
- స్థానిక యువతకు పెద్దఎత్తున ఐటీ కొలువులు
- పుట్టిన గడ్డపై మమకారంతో కంపెనీల ఏర్పాటుకు ముందుకొచ్చిన ఎన్నారైలు
- స్వయంగా పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉద్యమాల గడ్డగా పేరు పొందిన ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఐటీ విప్లవం రాబోతోంది. ఆధునిక సాంకేతిక కొలువులను స్థానిక యువతకు అందుబాటులోకి తెచ్చి ఉపాధి వెలుగు పంచబోతోంది. నల్లగొండ, సూర్యాపేటలో నెలకొల్పుతున్న ఐటీ హబ్‌లను ఈనెల 2వ తేదీన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు ప్రారంభించనున్నారు. టాస్క్ సహకారంతో మొదటి వారం నుంచే కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించబోతున్నాయి. పుట్టిన గడ్డపై మమకారంతో కంపెనీల ఏర్పాటుకు ఎన్నారైలు ముందుకొస్తున్నారు. ముందుగా రెండు జిల్లాల్లోని రెండు హబ్‌లలో దాదాపు 32 కంపెనీలు తమ కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. ఆ తరువాత మరిన్ని కంపెనీలు తమ కంపెనీలను ఇక్కడి హబ్‌లలో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాయి. వారితో నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి వారితో సంప్రదింపులు జరుపడంతోపాటు ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.



ఐటీ హబ్‌లో ఫర్నిచర్

సిద్ధమైన ఐటీ హబ్

నీలగిరి పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మాణమైన ఐటీ టవర్ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. రూ.90 కోట్లతో పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మూడు ఎకరాల విస్తీర్ణంలో ఐదంతస్తుల భవనాన్ని నిర్మించారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా హైదరాబాద్ హైటెక్ సిటీకి ఏమాత్రం తీసిపోకుండా నీలగిరి ఐటీ టవర్ రూపుదిద్దుకుంది. జీ ప్లస్ ఫైవ్ భవనంలో కంపెనీల కార్యకలాపాలకు అనుగుణంగా కాన్ఫరెన్స్ హాల్స్, సెంట్రల్ ఏసీ, కంపెనీల కార్యాలయాలు ఏర్పాటుకు విశాలమైన గదులు అధునాతన సౌకర్యాలతో నిర్మితమైంది. ఐటీ హబ్ నిర్మాణంతో సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే ఇక్కడి యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ ఉద్యోగాలు అంటే గతంలో రాష్ట్ర రాజధానికి మాత్రమే వెళ్లాల్సి ఉండేది. నీలగిరి పట్టణంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఐటీ టవర్ నిర్మాణంతో ఇక్కడ యువతలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ముందుకొచ్చిన 17 కంపెనీలు..

నీలగిరి ఐటీ టవర్‌లో మొత్తం 3600 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మొదటి దశలో కంపెనీలు స్థాపిస్తామని 17 కంపెనీలు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పందం చేసుకున్నాయి. అవి మొదటి దశలో 1200 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. ఈనెల 2వ తేదీన రాష్ట్ర పురపాలక, ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఐటీ టవర్ అట్టహాసంగా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే రెండేళ్లలో షిఫ్ట్‌కు 1200 మంది చొప్పున మూడు షిఫ్టుల్లో 3600 మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో 12 వేల మంది అభ్యర్థులు పాల్గొన్నారు. అందులో 450 మందిని ఎంపిక చేశారు. ప్రారంభోత్సవం రోజున ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా 100 మందికి ఆఫర్ లెటర్లను అందజేయనున్నారు.

కంపెనీలివే..

డిజిక్స్‌పార్క్, ఎస్‌ఫ్లాక్స్ డాటా సొల్యూషన్స్, ఇన్ఫోజంక్షన్, స్మార్ట్ ఐఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్, విన్సోటైన్‌మెంట్ మీడియా అండ్ బ్రాడ్‌కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్, కేబీకే బిజినెస్ సొల్యూషన్స్, హిట్‌లూప్, బీసీడీసీ క్లౌడ్ సెంటర్స్, న్యూమరిక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, జీఎస్‌ఆర్ మీడియా, కోణం ఫౌండేషన్, డీమాంట్జ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మరో ఐదు కంపెనీలు.

వార్షిక ప్యాకేజ్ రూ.25 లక్షల వరకు..

ఐటీ టవర్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారికి వారి సాంకేతిక పరిజ్ఞానాన్ని బట్టి ఏడాదికి రూ.1.25 లక్షల నుంచి రూ.25 లక్షలు ఇచ్చేందుకు సంబంధిత కంపెనీలు వారితో ఒప్పందం కుదుర్చుకున్నాయి.

“ స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

స్థానిక యువత ఎక్కడికో ఉద్యోగం కోసం వెళ్లకుండా, ఇక్కడే ఉంటూ ఉద్యోగం చేసుకునేలా ఐటీ హబ్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. రికార్డు స్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభమైన ఏడాది కాలంలోనే పనులను పూర్తి చేశాం. 2021 డిసెంబర్ నెలాఖరులో మంత్రులు కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి ఐటీ టవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.90 కోట్లతో ఈ ఐటీ టవర్ 1.75 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏడాది కాలంలో నిర్మించాం. ఆధునిక హంగులతో నిర్మాణం చేపట్టినా అనుకున్న సమయానికి పూర్తి చేసి ఈనెల 2వ తేదీన ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. నల్లగొండ జిల్లాలో పుట్టి, పెరిగి, చదువుకొని ఎదిగి విదేశాల్లో ఐటీరంగంలో స్థిరపడిన ఎన్నారైలు ఇక్కడ కంపెనీలను ఏర్పాటు చేస్తున్నారు. యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో వారు ముందుకు రావడం అభినందనీయం.

– ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

పరిశీలించిన ఎమ్మెల్యే..

ఐటీ టవర్‌ను శనివారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పరిశీలించారు. భవనం పైఅంతస్తులోకి వెళ్లి కార్యాలయాల ఆవరణ, లోపల ఏసీ, ఫర్నిచర్, గదులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదే విధంగా ఐటీ టవర్ ఎదుట గ్రీనరీ, గార్డెన్, ఆవరణ తదితర ప్రాంతాలను పరిశీలించారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కంచర్ల భూపాల్‌రెడ్డి

మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

నల్లగొండ : నల్లగొండ పట్టణంలో ఈ నెల 2వ తేదీన రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్న నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ శనివారం పరిశీలించారు. మర్రిగూడ బైపాస్ జంక్షన్, ఐటీ టవర్, సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్, క్లాక్‌టవర్ వద్ద అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకాలు, ఎన్‌జీ కళాశాలలో నిర్వహించే ప్రగతి నివేదన సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ కెవి.రమణాచారి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీకి ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : బతుకమ్మ చీరల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండి, రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి మహిళకు బతుకమ్మ చీర అందజేయాలన్నారు. బతుకమ్మ చీరల పంపిణీలో భాగంగా జిల్లాలో 5 లక్షల 61 వేల చీరలు అవసరం కాగా, చేనేత జౌళి శాఖ నుంచి 4 లక్షల చీరలను జిల్లాకు వచ్చాయని తెలిపారు. ఆ చీరలను శాలిగౌరారం, నాంపల్లి, నిడమనూరు, మిర్యాలగూడ గోదాముల్లో ఉంచామని.. అక్కడి నుంచి ఎంపీడీఓలు, తహసీల్దార్లు సమన్వయంతో గ్రామాలకు తరలించి ప్రభుత్వ భవనాల్లో భద్రపరచాలని సూచించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించి చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా సంబంధిత అధికారులకు చూడాలన్నారు. చీరల పంపిణీకి డీఆర్‌డీఓ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, చేనేత జౌళి శాఖ ఏడీ ద్వారక్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ నాగేశ్వరరావు, గిరిజన శాఖ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ షాపింగ్ కాంప్లెక్స్‌లు స్వాధీనం

- విచారణ నివేదికను బోర్డుకు సమర్పిస్తాం
- వక్ఫ్‌బోర్డు ఓఎస్‌డీ మహమ్మద్‌సాదత్



విచారణ చేపడుతున్న వక్ఫ్‌బోర్డు అధికారులు

మిర్యాలగూడ : మిర్యాలగూడ పట్టణంలోని వక్ఫ్ ఆస్తులను వక్ఫ్‌బోర్డు సీఈఓ ఆదేశానుసారం స్వాధీనం చేసుకుంటున్నట్లు బోర్డు ఓఎస్‌డీ మహమ్మద్ సాదత్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఇస్లాంపుర, కుండల బజార్‌లోని (బడా అషుర్ ఖానా) వక్ఫ్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ప్రతి షాపునకు బోర్డు అధికారులు వెళ్లి షాపుల కిరాయిదారులను విచారించారు. ఎంతకాలంగా షాపులో కిరాయికి ఉంటున్నారు.. ప్రతి నెల కిరాయి ఎంత? ఎవరికి చెల్లిస్తున్నారు.. విద్యుత్ బిల్లులు ఎవరి పేరు మీద ఉన్నాయి అని విచారించి సంబంధిత రశీదులు, జిరాక్స్ కాపీలను సేకరించి రికార్డు చేశారు. వక్ఫ్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ప్రతి షాపు కిరాయి ఇక నుంచి బోర్డు అధికారికే చెల్లించాలని సూచించారు. షాపుల కిరాయి విషయంలో బోర్డు అధికారికి తప్ప ఇతరులకు జోక్యం ఉండన్నారు. ఈ విషయంపై ఓఎస్‌డీ సదత్ విలేకరులతో మాట్లాడుతూ కాంప్లెక్స్ షాపుల నిర్వహణలో బకాయిల విషయాల్లో అవకతవకలు జరిగినట్లు బోర్డుకు ఫిర్యాదు అందిందన్నారు. దీనిపై 2022 ఆగస్టు నెలలో విచారణ జరిపి మూడు రోజుల్లోగా అద్దె బకాయిలకు సంబంధిత వివరాలు, రశీదు బుక్, షాపుల నిర్వహణ రికార్డులను సమర్పించాలని అదేశించామని తెలిపారు. సంబంధిత నిర్వాహకులు నెలలోగా రికార్డు సమర్పిస్తామని గడువు తీసుకుని.. ఇప్పటి వరకు ఎలాంటి రికార్డులు సమర్పించలేదన్నారు. దీంతో వక్ఫ్‌బోర్డు సీఈఓ ఆదేశానుసారం సమగ్ర విచారణ జరుపుతున్నామని ఈ నివేదికను సీఈఓకు అందజేస్తామని తెలిపారు. షాపులను స్వాధీనం చేసుకున్నామని, ఇక నుంచి వక్ఫ్‌బోర్డు పర్యవేక్షణలో షాపుల నిర్వహణ ఉంటుందన్నారు. ఆయన వెంట వక్ఫ్‌బోర్డు ఆడిట్ ఇన్‌స్పెక్టర్ షేక్ మహిమూద్, సర్వేయర్ సుజాత్‌అలీఖాన్, ఆర్‌ఐ శ్యాం, జాని తదితరులు ఉన్నారు.

వ్యాపారులకే దుకాణాలు

- నీలగిరి మున్సిపాలిటీకి చెందిన 14 లీజు షాపుల రిజిస్ట్రేషన్ పూర్తి


నల్లగొండ టూ టౌన్ : నల్లగొండ పట్టణంలోని మున్సిపాలిటీకి చెందిన 14 లీజు దుకాణాల రిజిస్ట్రేషన్ శనివారం పూర్తయింది. 30 సంవత్సరాల క్రితం నుంచి ఆ దుకాణాల్లో ఉన్న వారికి మున్సిపల్ అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ దుకాణాలను లీజు వ్యాపారులకు క్రమబద్ధీకరించాలని కొన్నేళ్ల క్రితమే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మున్సిపాలిటీ నుంచి లీజు పొంది 30 సంవత్సరాల నుంచి వ్యాపారం కొనసాగిస్తున్న వారికి దుకాణాలు రిజిస్ట్రేషన్ చేసేందుకు గతంలోనే దరఖాస్తులను స్వీకరించారు. ఎలాంటి కేసులు లేని 14 దుకాణాలకు రెండు నెలల క్రితమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి మున్సిపల్ అధికారులు సర్వ సిద్ధం చేయగా రాజకీయ కారణాల వల్ల ఆఖరి నిమిషంలో నిలిచిపోయింది. తాజాగా ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు రావడంతో 14 మంది దుకాణాదారులకు మున్సిపల్ అధికారులు శనివారం రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు. ఇక మిగిలిన 220 దుకాణాలు కూడా వ్యాపారులకే దక్కనున్నాయి.

పనులు నాణ్యతతో చేపట్టాలి

నిడమనూరు : భవన నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని రిజిస్ట్రార్ ఆఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నందికొండ నర్సింగరావు, జిల్లా జడ్జి నాగరాజు పేర్కొన్నారు. నిడమనూరులో రూ.5.5 కోట్ల నిర్మిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన భవన నిర్మాణ పనులను శనివారం వారు పరిశీలించారు. పనుల పురోగతిని సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక జడ్జి టి.స్వప్న, సూపరింటెండెంట్ రేణుక, డిప్యూటీ నాజర్ అంజయ్య, న్యాయవాదులు ఉన్నం చిన వీరయ్య, బొల్లం శ్రీను, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టుకు పెరిగిన వరద

- మూడు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల



మూసీ గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు శనివారం ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో అధికారులు మూడు క్రస్ట్ గేట్లను పైకెత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. మూసీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి మూసీకి 1,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా ప్రస్తుత నీటిమట్టం 644.48 అడుగుల (4.33 టీఎంసీలు) వద్ద ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం వస్తుండడంతో పాటు నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరువలో ఉండడంతో అప్రమత్తమైన అధికారులు శనివారం ప్రాజెక్టు మూడు క్రస్ట్ గేట్లను ఒక అడుగు మేర పైకెత్తి 1,576 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా 512 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి మొత్తం 2,170 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

దోమలను నివారించాలి

- కాలనీల్లో డ్రెయినేజీలు లేక అవస్థలు పడుతున్నాం
- ఖాళీ ప్లాట్లలో మురుగు, చెట్లు లేకుండా చూడాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలు ఏకరువు
- నిరంతరం ఫాగింగ్ చేస్తాం : కమిషనర్ పూర్ణచందర్


మిర్యాలగూడ టౌన్ : కాలనీల్లో డ్రెయినేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.. సీసీ రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగు చేరి దుర్వాసన వస్తోంది.. బురద వల్ల దోమలు, ఈగలు, పురుగులు బెడద ఎక్కువగా ఉంది.. నిరంతరం ఫాగింగ్ చేసి దోమలను నివారించాలని మిర్యాలగూడ పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన వారు తమ సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మిర్యాలగూడ పట్టణంలోని నెలకొన్న సమస్యలపై శనివారం 'సాక్షి' మున్సిపల్ కమిషనర్ ఎం.పూర్ణచందర్‌తో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. వివిధ కాలనీలకు చెందిన వారు ఫోన్ ద్వారా చెప్పిన సమస్యలను, వారి కాలనీ పేర్లను కమిషనర్ నోట్‌బుక్‌లో రాసుకొని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఫోన్ ఇన్‌లో వెలిబుచ్చిన సమస్యలు, కమిషనర్ చెప్పిన సమాధానాలు ఇలా..

ప్రశ్న : 10వ వార్డులో డ్రెయినేజీ సమస్యతో పాటు విద్యుత్ దీపాలు కూడా సరిగా వెలుగడం లేదు.
– కె. మధుసూధన్‌రెడ్డి, రవీంద్రనగర్

కమిషనర్ : డ్రెయినేజీలను శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. నూతన డ్రెయినేజీ కావాలంటే రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారి దోమలు పెరిగాయి. దోమల మందు కొట్టడం లేదు.
– బంటు యాదగిరి, సీతారాంపురం

కమిషనర్ : ప్రస్తుతం ఫాగింగ్ మిషన్ల ద్వారా స్ప్రే చేయిస్తున్నాం. రోటేషన్ పద్ధతిలో ఫాగింగ్ మిషన్లతో రోజూ ఫాగింగ్ చేయిస్తున్నాం.



సాక్షి ఫోన్ ఇన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్

ప్రశ్న : డ్రెయినేజీని సగం కట్టి వదిలి వేయడంతో మురుగు నిల్వ ఉంటోంది.
– రవి, కొండల్ సుందర్‌నగర్

కమిషనర్ : ఈ విషయంపై టౌన్ ప్లానింగ్ అధికారులను సంబంధింత ప్రాంతానికి పంపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : కెనాల్ రోడ్డు నుంచి రైల్వే ట్రాక్ వరకు ఉన్న కాల్వ కట్ట రోడ్డును కంప చెట్లు కమ్మేశాయి.
– అరుణ్, 8వ వార్డు

కమిషనర్ : ఈ విషయాన్ని ఎన్‌ఎస్‌పీ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మా పరిధిలో ఉంటే జేసీబీతో చెట్లు తొలగిస్తాం.

ప్రశ్న : సబ్ జైలు రోడ్డు విద్యానగర్‌లో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. **– శ్రీనివాస్‌రావు, విద్యానగర్**

కమిషనర్: ఈ విషయాన్ని శానిటరీ విభాగం అధికారికి తెలియజేసి డ్రెయినేజీ శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న : ఈదులగూడెంలో సీసీ రోడ్లు సరిగా లేవు, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది.
– శివశంకర్, ఈదులగూడెం

కమిషనర్ : నూతన సీసీ రోడ్డు కావాలంటే ముందుగా వినతిపత్రాన్ని అందజేస్తే ఆ విషయం కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకెళ్తాం. ప్రస్తుతం ఉన్న డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న : రెడ్డికాలనీలో కోతుల సమస్య తీవ్రంగా ఉంది. **– లక్ష్మణ్, రెడ్డికాలనీ**

కమిషనర్ : ఈ సమస్యను పాలక మండలికి తెలియజేసి.. కౌన్సిల్ నిర్ణయం తర్వాత కోతుల నియంత్రణకు చర్యలు చేపడతాం.

ప్రశ్న : చికెన్ సెంటర్ యజమానులు కోళ్ల, ఇతర వ్యర్థాలను జనావాసాల నడుమ వేస్తున్నారు.
– చందనసింగ్, గాంధీనగర్

కమిషనర్ : ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

ప్రశ్న : కోమల మెడికల్స్ సమీపంలో డ్రెయినేజీ పూడిపోయింది.
– సోమిరెడ్డి, 25వ వార్డు

కమిషనర్ : నూతన డ్రెయినేజీ నిర్మాణ విషయాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తాం. మురుగునీరు నిల్వ ఉంటే పారిశుద్ధ్య సిబ్బంది చేత శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న : ఇండ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉంటోంది.
– బి.వెంకటేశ్వర్లు, అశోక్‌నగర్, రాము, నందిపాడు

కమిషనర్ : మున్సిపాలిటీలో ఓపెన్ ప్లాట్లను గుర్తించాం. వాటి యాజమానులకు ఇప్పటికే రెండు నోటీసులు ఇచ్చాం. ఖాళీ స్థలాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


కళ్లెం బొందయ్య మృతదేహం

చిట్యాల : చిట్యాల మండలం పేరేపల్లి గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రానికి చెందిన బేడ బుడిగ జంగాలకు చెందిన కళ్లెం బొందయ్య(60) భిక్షాటన చేసుకుంటూ చిట్యాల మండలం వెలిమి నేడు గ్రామంలో ఉంటున్నాడు. పది రోజులు గా ఆయన వెలిమినేడు నుంచి బయలుదేరి చుట్టు పక్కల గ్రామాలకు భిక్షాటనకు వెళ్లి వస్తున్నాడు. శుక్రవారం పేరేపల్లి గ్రామానికి బైక్‌పై వెళ్లి రాత్రి సమయంలో తిరుగు ప్రయాణమయ్యాడు. పేరేపల్లి శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బొందయ్య కింద పడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండలోని ప్రభు త్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఎల్లమ్మ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.

కనీస వేతనం అమలు చేయాలి

నల్లగొండ : రైతుల ఇళ్ల ముందుకే వెళ్లి సేవలు అందిస్తున్న గోపాల మిత్రలకు కనీస వేతనం అమలు చేయాలని గోపాల మిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నల్లగొండలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా గోపాలమిత్రల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విధి నిర్వహణలో చనిపోయిన గోపాలమిత్ర కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఒకరికి పశు సంవర్థక శాఖలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్ పోస్టు ఇవ్వాలని కోరారు. చెరుకు శ్రీనివాస్ ఇటీవల బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా ఉమ్మడి జిల్లాల కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి ,శంభులింగం యాదయ్య ,లింగయ్య, రాములు, యాదగిరి, నాగయ్య, ఉపేందర్, సత్యనారాయణ, మల్లేష్, వెంకన్న, రాంచంద్ర, బాలరాజు, వీరారెడ్డి, కిషన్ పాల్గొన్నారు.

ఆత్మీయ పలకరింపు.. ఆదరణ కరువై..

- అవసాన దశలో ఆశ్రమాలను ఆశ్రయిస్తున్న అభాగ్యులు
- అక్కున చేర్చుకుని ఆదరిస్తున్న ఆశ్రమాల నిర్వాహకులు
- నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

రామగిరి(నల్లగొండ): యవ్వన దశలో తమ శక్తియుక్తులన్నింటినీ పిల్లల ఎదుగుదలకు వెచ్చించే అమ్మ నాన్నలు.. జీవితపు చరమాంకంలో బుక్కెడు బువ్వ, నిలువ నీడ, ఆత్మీయ ఆదరణకు నోచుకోక వృద్ధాశ్రమాల్లో చేరుతున్నారు. పెద్దల పట్ల నేటి తరం చూపిస్తున్న వ్యవహారశైలిని పరిగణలోకి తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో ఈ సమస్యను చర్చించి వృద్ధుల దినోత్సవాన్ని జరుపుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 1న ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

పిల్లలకు భారం కావడం ఇష్టం లేకనే..

ప్రేమ, ఆత్మీయతల్లేని సంసారాలు, ఉద్యోగాలతో కొడుకు, కోడళ్లతో వృద్ధులు దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. నేటి సమాజంలో చాలా మంది వృద్ధులు తమ పిల్లలకు భారం కావడం ఇష్టం లేకనే వృద్ధాశ్రమంలో చేరడానికి ఆసక్తి చూపుతున్నారు.


మల్లేపల్లివారిగూడెం ఆశ్రమంలో వృద్ధులకు భోజనం పెడుతున్న నిర్వాహకులు

ఆశ్రయం కల్పిస్తున్న వృద్ధాశ్రమాలు

ఆత్మీయ పలకరింపునకు నోచుకోక ఎందరో వృద్ధులకు జీవితపు చివరి దశలో వృద్ధాశ్రమాలు సేద దీరుస్తున్నాయి. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవే లక్ష్యంగా చేసుకుని కొంత మంది నిర్వాహకులు స్వచ్ఛందంగా సొంత ఖర్చులతో వృద్ధాశ్రమాలను స్థాపించారు. అభాగ్యులు, నిరాధరణకు గురైన అనేక మంది వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. జిల్లాలో 10వరకు వృద్ధాశ్రమాల్లో ఎంతో మంది అభాగ్యులు ఆశ్రయం పొందుతున్నారు. ఎవరూ లేని అనాథ వృద్ధులు చనిపోతే అంతిమ సంస్కారాలు కూడా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.. ఆశ్రమాల నిర్వాహకులు.

వృద్ధులే నా కుటుంబ సభ్యులు



ఆశ్రమమే నా ఇల్లు. వృద్ధులే నా కుటుంబ సభ్యులు. భర్త చనిపోయాడు, పిల్లలు కూడా లేరు. చిన్నతనంలో ఊరిలో జరిగిన సంఘటనతో వృద్ధాశ్రమం పెట్టాలనే ఆలోచన వచ్చింది. ఆర్థికంగా లేకపోయినప్పటికీ 1992లో వృద్ధాశ్రమాన్ని ప్రారంభించా. ప్రారంభం తొలినాళ్లో నిర్వహణ భారంగా ఉండేది. ఒకానొక సందర్భంలో అద్దెకూడా చెల్లించలేని స్థితిలో యజమాని ఆశ్రమానికి తాళం వేశాడు. దీంతో ఒంటిపై ఉన్న బంగారం అమ్మి కిరాయి కట్టాను. అప్పులు పెరగడం వల్ల చనిపోవాలనుకున్నా. చనిపోతే జీవితానికి అర్థం లేదని మనసు మార్చుకుని ఎన్ని కష్టాలు ఎదురైనా ఆశ్రమాన్ని కొనసాగిస్తున్నా.

– పాడిశెట్టి పిచ్చమ్మ, శాంతి మహిళా మండలి నిర్వాకురాలు

వృద్ధాప్యం.. పసితనం లాంటిది



వృద్ధాప్యం పసితనం లాంటిది. చిన్న పలకరింపును కోరుకునే వయసు వారిది. పిల్లల్ని కంటికి రెప్పలా పెంచి, ప్రయోజకులను చేసి, బిడ్డల కోసమే జీవితాన్ని ధారపోసిన వృద్ధ తల్లితండ్రులు నేటి సమాజంలో ఎందరో ఉన్నారు. వివిధ రంగాల్లో అపార అనుభవం కలిగిన వారి మేధాశక్తి భవిష్యత్ తరాలకు అందాల్సి న అవసరం ఉంది.

– సముద్రాల మల్లికార్జున్, సీనియర్ సిటిజన్

తల్లిదండ్రులు లేని లోటు తీరింది



ఆశ్రమం నిర్వహించడం వల్ల తల్లితండ్రులు లేని లోటు తీరింది.అమ్మనాన్నలు ఇద్దరు 2010లో చనిపోయారు. పిల్లలు అమ్మమ్మ తాతయ్యతో గడపాలని అని అడిగినప్పుడు ఆశ్రమానికి వస్తుంటాం. వారితో విడదీయరాని అనుబంధం ఉంటుంది. ప్రతి శని, ఆదివారాలు ఆశ్రమాని పిల్లలతో వచ్చి వారితో కాలక్షేపం చేస్తాం. సొంత వాళ్లతో ఉన్న అనుభూతి కలుగుతుంది. ఎవరి నుంచి ఏమి ఆశించకుండా సొంత ఖర్చులతో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నా.

– ప్రీతి రోస్ లైన్, ఎస్తేర్ దేవదాస్, వృద్ధాశ్రమం నిర్వాహకురాలు

ఓసీపీలో కాంట్రాక్ట్ కార్మికుడి ఆత్మహత్య


వీరస్వామి (ఫైల్)

శ్రీరాంపూర్: విధులకు వద్దన్నారని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు గనిలో కాంట్రాక్టు కార్మికుడు దొంతగాని వీరస్వామి(50) ఓబీ క్యాంపు సైటు వద్ద శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం ఆయన మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. శ్రీరాంపూర్ పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లాకు చెందిన వీరస్వామికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇక్కడికి సమీపంలోని రామారావుపేటలో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. శ్రీరాంపూర్ ఓసీపీ ఓబీ పనులు నిర్వహించే సీఆర్‌ఆర్ కంపెనీలో జనవరి నుంచి కాంట్రాక్టు కార్మికుడిగా చేస్తున్నాడు. సెప్టెంబర్ 27న కాంట్రాక్టు సంస్థ మేనేజర్ ఉద్యోగంలోకి తీసుకోవడం లేదు. ఏదో వస్తువులు దొంగతనంగా తీసుకెళ్లిన అభియోగంతో ఈ చర్యకు పాల్పడ్డట్లు తోటి కార్మికులు తెలిపారు. దీంతో మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

నష్టపరిహారం చెల్లించాలని ఆందోళన

పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించకుండా ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేశారు. పనిలోకి తీసుకోకపోవడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. శ్రీరాంపూర్ ఓసీపీ పీఓ పురుషోత్తంరెడ్డి, మేనేజర్ సుధీర్ ఆందోళనకారులు, ఓబీ కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు, ఐఎన్టీయూసీ నాయకులు శంకర్‌రావు, కలవేని శ్యాం, ఏఐటీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ సెక్రెటరీ అఫ్రోజ్ ఖాన్ ఆందోళన తీవ్రతరం చేశారు. దీంతో కాంట్రాక్ట్ సంస్థ రూ.8.20లక్షలు నష్ట పరిహారంగా ఇస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు.

గాలిపెడుతుండగా పేలిన టైరు.. వ్యక్తి మృతి


ఎస్‌కె. సైదా (ఫైల్)

తుంగతుర్తి: గాలిపెడుతుండగా టైరు పేలి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తుంగతుర్తిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన ఎస్‌కె.సైదా (45) తుంగతుర్తిలోని ఎస్‌బీఐ బ్యాంక్ పక్కన పంక్చర్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారీ కార్యక్రమంలో భాగంగా ట్రాక్టర్ టైరును ఇప్పి పంక్చర్ వేశాడు. అనంతరం టైరుకు గాలిపెడుతుండగా ఒత్తిడి అధికమై టైరు పేలడంతో దానికి ఉన్న డిస్క్ సైదా తలకు బలంగా తాకడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోవడంతో మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

హత్య కేసులో నిందితుల అరెస్ట్


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణారెడ్డి

మేళ్లచెరువు : హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు కోదాడ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు.చింతలపాలెం మండలం కొత్తగూడెం తండాకు చెందిన గుగులోతు వాచ్యాకు అదే తండాకు చెందిన దాయాదులతో భూమి గెట్టు పంచాయితీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత నెల 24న జరిగిన గొడవలో దగ్గరి బంధువులు గుగులోతు చందర్‌రావు కుటుంబ సభ్యులైన గుగులోతు అరుణ, లావుడ్యా లక్ష్మీపార్వతి, లావుడ్యా చందర్‌రావు, లావుడ్యా గోపి, గుగులోతు సరోజినీ, లావుడ్యా అరుణ, భూక్యా తావు, లావుడ్యా కాంతి, లావుడ్యా బద్యా, లావుడ్యా మల్లేశ్వరీలు వాచ్యాపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని అదే రోజు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 26వ తేదీన మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులు మేళ్లచెరువు మండలం హేమ్లాతండాలోని బంధువుల ఇంటి వద్ద దాచుకున్నట్లు గుర్తించి వారిని శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు. సమావేశంలో ఆయన వెంట ఏఎస్ఐ ఆనంద్ నాయక్ సిబ్బంది ఉన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలోని స్వామిరామానందతీర్థ గ్రామీణ సంస్థలో 2 నెలల కాలవ్యవధి గల స్వయం ఉపాధి సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సుకు ఇంటర్ పాస్, సెల్‌ఫోన్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ టెక్నీషియన్ కోర్సుకు పదో తరగతి, ఆటోమొబైల్ టూ, త్రీ వీలర్ మెకానిజం అండ్ సర్వీసింగ్ కోర్సుకు పదో తరగతి పాస్ లేదా ఫెయిల్, బ్యూటీషియన్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత కల్గి ఉండాలని అన్నారు. అలాగే అభ్యర్థులు 18 నుంచి 30 మధ్య వయస్సు కల్గి ఉండాలని తెలిపారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలతో ఈ నెల 3న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరు కావలెయునని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.3వేల ఫీజుతో హాస్టల్ వసతి కల్పించబడుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111, 9133908222 మొబైల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

మహిళా హక్కులను పరిరక్షించాలి


జీపు యాత్రను ప్రారంభిస్తున్న అరుణజ్యోతి

భువనగిరిటౌన్ : మహిళా హక్కులను పరిరక్షించాలని అఖిలభారత మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి డిమాండ్ చేశారు.అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏర్పాటు చేసిన జీపు యాత్రను ఆమె ప్రారంభించి మాట్లాడారు. దేశంలో 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర సరుకుల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ ప్రజల జీవితాలకు భద్రత లేకుండా చేస్తున్నదని మండిపడ్డారు. దేశ భద్రతకు మహిళల భద్రతకు మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యమని ఐద్వా భావిస్తూ దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేస్తూ జీపు యాత్రలు, పాదయాత్రలు నిర్వహిస్తుందన్నారు. యాత్రలో జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి, జిల్లా సహాయ కార్యదర్శి దోనూరు ,నిర్మల జిల్లా కోశాధికారి కల్లూరి నాగమణి జిల్లా నాయకురాళ్లు మల్లెపల్లి లలిత, ఎండి రేష్మ ,కొత్త లలిత పాల్గొన్నారు.

యాదాద్రిలో భక్తుల సందడి


క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. వినాయకుడిని నిమజ్జనం చేసిన తర్వాత ఆయా ప్రాంతాల ప్రజలు నేరుగా యాదా ద్రీశుడిని దర్శించుకునేందుకు వస్తున్నారు. ఆదివారం భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. స్వామివారి ధర్మ దర్శనానికి గంటన్నరకు పైగా సమయం పడుతుందని భక్తులు చెబుతున్నారు. వివిధ పూజలతో స్వామివారికి రూ.20,31,987 నిత్యాదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

కాళేశ్వరం ప్రాజెక్టుతో కాంట్రాక్టర్ల జేబులు నింపారు

- మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ: నాడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అంగన్‌వాడీల బతుకులు మారలేదు కానీ కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ఆంధ్రా కాంట్రాక్టర్ల జేబులు నింపారని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న సమ్మెలకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 70వేల మంది ఉన్న అంగన్‌వాడీ టీచర్లు పనిచేస్తున్నారని, వీరికి నెలకు రూ.13,500 ఇవ్వడం సరికాదని, రూ.26వేల వేతనం అమలు చేయాలన్నారు. 30వేల పైచిలుకు ఉన్న ఆశా వర్కర్లకు రూ.9వేల వేతనం సరిపోదని రూ.18వేలు అందించాలన్నారు. హెల్త్ కార్డులు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్ల రుణాలు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని , వేల ఎకరాల భూములను దోచుకోవడం బాధాకరమన్నారు. పేదలకు న్యాయం చేయని ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బడుగులకు పట్టం కట్టాలి

- ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్


మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

భువనగిరిటౌన్ : వచ్చే ఎన్నికల్లో అగ్రవర్ణ నాయకులను ఓడించి బడుగులకు పట్టం కట్టాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా. విశారదన్ మహరాజ్ పిలుపునిచ్చారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అన్ని పార్టీల నాయకత్వం రెడ్లదేనని ఆయన విమర్శించారు. శనివారం రాత్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా శాఖ ఆవిర్భావ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధర్మ సమాజ్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే యాదాద్రికి కొండా లక్ష్మణ్ బాపూజీ జిల్లాగా పేరు పెడతామన్నారు. జిల్లాలో లక్షలాది చేనేత పద్మశాలి వారు ఉన్నారని వారికి అత్యాధునిక చేనేత పరిశ్రమలని అధికారంలోకి వచ్చిన వెంటనే ఏర్పాటు చేయిస్తామన్నారు. బీఆర్ఎస్ కాంగ్రెస్, బీజెపి పార్టీలు ఒక్కటేనన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆయా పార్టీల రెడ్లు, వెలమ దొరలను ఓడించి బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఇక్కడి నుంచి అసెంబ్లీకి పంపిస్తామన్నారు. ఇప్పుడున్న రాజకీయ పార్టీలన్నీ అగ్రకుల వ్యాపార కంపెనీలేనని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాలయ్య పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

మోత్కూరు : బైక్ అదుపుతప్పి కింద పడడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మోత్కూరులోని పాత బస్టాండ్‌లో శనివారం జరిగింది. మోత్కూరు మండలం ముశిపట్ల రామ్‌నగర్‌కు చెందిన కొణతం నర్సిరెడ్డి ఉదయం పని నిమిత్తం తన బైక్‌పై పట్టణ కేంద్రానికి వచ్చాడు. మోత్కూరులోని పోతాయిగడ్డ నుంచి పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వైపు వెళ్తున్న క్రమంలో నర్సిరెడ్డి అనారోగ్యానికి గురయ్యాడు. కళ్లు మూతలు పడడంతో బైక్ అదుపుతప్పి బస్టాండ్‌లోని గాంధీబొమ్మ వెనుకాల నిర్మాణంలో ఉన్న ఇంటి మెట్ల పైకి బైక్ దూసుకెళ్లి గోడను ఢీకొట్టింది. స్థానికులు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నర్సిరెడ్డిని 108 వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం నర్సిరెడ్డిని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

బైక్‌ను బస్సు ఢీకొనడంతో..

వేములపల్లి : బైక్‌ను బస్సు ఢీకొట్టిన ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. వేములపల్లి మండల కేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వేములపల్లి గ్రామానికి చెందిన చెరుకుపల్లి వినోద్ తన పని ముగించుకుని బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. మండల కేంద్రంలోని చర్చి వద్ద బైక్ యూటర్న్ తీసుకుంటుండగా మిర్యాలగూడ నుంచి నల్లగొండకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి వినోద్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వినోద్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి యువకుడి బలవన్మరణం


హుస్సేన్ మృతదేహం

పెన్‌పహాడ్ : పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పెన్‌పహాడ్ మండల పరిధిలోని గూడెపుకుంట తండాలో ఈ ఘటన చోటుచేసుకుంది. తండాకు చెందిన జరుపుల హుస్సేన్ (24)కు అదే తండాకు చెందిన ధీరావత్ సుశీల, ధీరావత్ నాగునాయక్, ధీరావత్ లింగాల కుటుంబంతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. పాత కక్షల కారణంగా ధీరావత్ సుశీల, హుస్సేన్‌కు మధ్య శుక్రవారం సాయంత్రం గొడవ జరిగింది. ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరగడంతో హుస్సేన్ ఈ క్రమంలో సుశీలపై చేయిచేసుకున్నాడు. దీంతో సుశీల, ఆమె కుటుంబ సభ్యులు హుస్సేన్‌ను అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన హుస్సేన్ మాచారం గ్రామ శివారుకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అనంతరం స్నేహితులకు ఫోన్ ద్వారా విషయం తెలిపాడు. వెంటనే వారు అక్కడికి వెళ్లి హుస్సేన్‌ను 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి జరుపుల కాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : సీఎంఓ


రిజిస్టర్లను పరిశీలిస్తున్న సీఎంఓ వీరయ్య

అడవిదేవులపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్(సీఎంఓ) వీరయ్య అన్నారు. అడవిదేవులపల్లి మండలంలోని ముల్కచర్ల గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలను శనివారంఆయన సందర్శించారు. అనంతరం టీచర్ డైరీ, టీఎల్‌ఎమ్స్‌తో పాటు వివిధ రకాల రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంఓ వీరయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆజాదీకా అమృత్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్రాంనాయక్ ఆధ్వర్యంలో ప్రతి రోజు జాతీయ నాయకులను స్మరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రం గోపి, విజయలక్ష్మి, వీరేష్, ప్రసన్న, రమాదేవి, కృష్ణయ్య, ఏసు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టినందుకే బీఆర్ఎస్‌కు రాజీనామా


మాట్లాడుతున్న వార్డు కౌన్సిలర్ వట్టె రేణుక

సూర్యాపేట రూరల్ : బీసీలను అణచివేయాలన్న కుట్రతో తన భర్త వట్టె జానయ్య యాదవ్‌తో పాటు కుటుంబ సభ్యులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న కారణంగా భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశానని 13వ వార్డు కౌన్సిలర్ వట్టె రేణుక రాజీనామా తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో వట్టె జానయ్య యాదవ్ నివాసంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 100మంది మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో రాజీనామా చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో బీసీలకు సముచిత గౌరవం ఇవ్వకుండా, అవమానిస్తున్నారని తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి బీసీల సమస్యలను విన్నవించుకునేందుకు కనీసం సమయం కూడా ఇవ్వలేదని ఆవేదనవ్యక్తం చేశారు. బీసీల పక్షాన ఎమ్మెల్యేగా తన భర్త బరిలో నిలబడతానన్న ప్రకటనతోనే రెండు రోజుల్లోనే ఆయనపై 71 కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు. పేరుకే బీసీ సెల్ పదవులు ఇచ్చారు.. తప్ప సభా వేదికపైకి ఏనాడు కూడా కూర్చోనివ్వలేదని విమర్శించారు. తమకు మంత్రి జగదీష్‌రెడ్డిపై గౌరవం ఉందని, కానీ కొంతమంది ఆయన పక్కన ఉన్న వ్యక్తులు తన భర్తపై కావాలని కక్షపూరితంగా లేనిపోని విషయాలు చెప్పి నిందలు వేసేలా ప్రోత్సహించారని ఆవేదన వ్యక్తం చేశారు. చైతన్యవంతులైన ప్రజలు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు చాంద్‌పాషా, పెన్‌పహాడ్ మండల బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఆవుల అంజయ్య, సూర్యాపేట బీసీ సెల్ అధ్యక్షుడు కుంభం వెంకన్న, యల్కారం మాజీ సర్పంచ్ మోదాల సైదమ్మ, చింతకాయల అంజయ్య, లింగాల సైదులు, పిల్లలమర్రి మాజీ శివాలయం చైర్మన్ వల్లాల సైదులు పాల్గొన్నారు.

అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు

మునగాల(కోదాడ): ఖమ్మం జిల్లా తల్లంపాడు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దంపతులు మండపెల్లి సంతోష్‌కుమార్, భార్య ఝాన్సీరాణితో పాటు ఆయన సోదరుడి కుమార్తె యోజిత మృతదేహాలను శనివారం స్వస్థలమైన తాడువాయి శివారు గ్రామమైన ఎస్ఎంపేటకు తీసుకువచ్చారు. పెదనాన్న అంత్యక్రియల కోసం వచ్చిన సంతోష్‌కుమార్ భార్య ఝాన్సీరాణి, మరో బాలిక మృతిచెందం పట్ల గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు దిగ్భ్రాంతికి గురయ్యారు. వారి మృతదేహాలను కడసారి చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. గ్రామస్తులు, కుటుంబసభ్యులు, బంధువులు అశ్రునయనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మండపెల్లి సంతోష్‌కుమార్, భార్య, మరో బాలిక మృతిచెందినట్లు తెలుసుకున్న కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ శనివారం రాత్రి ఎస్ఎంపేటకు చేరుకొని మృతుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియలలో పాల్గొన్నారు.